క్లుప్తంగా

బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలి

పిడుగురాళ్ల: బడిఈడు పిల్లలు బడిలోనే ఉండాలని సీఏసీఎల్ (కాంపెనింగ్ ఎగెనిస్ట్ చైల్డ్ లేబర్)డిస్టిక్ కన్వీనర్ ఏడుకొండలు యాదవ్ అన్నారు. పట్టణంలోని బుడగ జంగాల కాలనీలోని చిన్నారులతో ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పర్యటించారు. బుడగ జంగాలతో తమ పిల్లలు కూలీ పనులకు పంపవద్దని, ప్రతి ఒక్కరు తమ పిల్లలను పాఠశాలలో చేర్పించి విద్యాబుద్ధులు నేర్పించాలని సూచించారు. పిల్లలను బడికి పంపించకుండా కూలీ పనులకు పంపిస్తే చట్టరీత్యా నేరమని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఈకార్యక్రమంలో బుడగ జంగాల కాలనీలోని చిన్నారుల తల్లిదండ్రులు, చిన్నారులు ఉన్నారు.

మండల సర్వే అధికారిగా రఘుపతి



దుర్గి: ప్రభుత్వం చేపట్టిన బదిలీల ప్రక్రియలో భాగంగా దుర్గి మండల సర్వేయర్‌గా ఎడ్ల రఘుపతి నూతనంగా బాధ్యతలు చేపట్టారు. ఈయన చిలకలూరిపేట డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేస్తూ పదోన్నతి పొంది దుర్గికి బదిలీ పై వచ్చారు. గతంలో పనిచేసిన పవన్ కుమార్ కలెక్టర్ కార్యాలయంలోని ఏడిఏ ఆఫీస్‌కి బదిలీపై వెళ్ళారు. ఈ సందర్భంగా మండల సర్వేయర్ రఘుపతి మాట్లాడుతూ ప్రజలు, రైతులు తమకు కావాల్సిన సర్వేలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని ఆయా తేదీల్లో తమను సంప్రదించి భూమికి సంబంధించిన సర్వే చేయించుకోవాలని కోరారు. ఎప్పటి కప్పుడు భూమి సర్వే రికార్డులను భద్రపరుస్తూ ఎటువంటి వివాదాలు లేకుండా సర్వే రికార్డును అందించే విధంగా కృషి చేస్తానని ఆయన తెలిపారు. ప్రధానంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన రీ సర్వే కొనసాగుతుందని వివరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా నూతక్కి రత్నకుమార్ బాధ్యత చేపట్టారు. ఈయన గురజాల నుంచి దుర్గికి బదిలీ పై వచ్చారు.

ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదు

ఎస్ఐ పవన్‌కుమార్



పిడుగురాళ్ల: ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదని పట్టణ ఎస్ఐ పవన్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని ఐలాండ్ సెంటర్‌లో రాంగ్‌రూట్‌లో ప్రయాణించే వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా జానపాడు రోడ్డు నుంచి పోలీస్ స్టేషన్‌కు వెళ్లే రూట్‌లో ఎక్కువ మంది వాహనదారులు రాంగ్ రూట్‌లో వస్తుండడంతో వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లేనిపక్షంలో ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తప్పవని తెలిపారు. రాంగ్ రూట్‌లో ప్రయాణిస్తున్న కొందరు వాహనదారులకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. రాంగ్ రూట్‌లో ప్రయాణించే వాహనాలకు ఫొటోలు తీసే కార్యక్రమం కూడా చేపట్టారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రేషన్ పంపిణీ

మాచర్ల: పట్టణంలోని ఆయా వార్డుల పరిధిలో నిత్యావసర రేషన్ సరుకులను రేషన్ వాహనాల ద్వారా విస్తృతంగా సరుకుల పంపిణీ కొనసాగుతుంది. తహసీల్దార్ జి రమేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ ఈవి రమణబాబు, సీఎస్ డిటి మురళీ ఆధ్వర్యంలో వలంటీర్ల పర్యవేక్షణలో నిత్యావసర వస్తువుల పంపిణీ జరుగుతుంది. ఇప్పటికే పట్టణంలోని 11 వాహనాల ద్వారా 85 శాతంకి పైగా సరుకుల పంపిణీ జరిగింది. మిగత సరుకులను శరవేగంగా అందజేసేందుకు ఆయా వాహనదారులు పంపిణీని ముమ్మరం చేశారు. ఈ సందర్భంగా రెవిన్యూ అధికారులు విస్తృతంగా రేషన్ పంపిణీని పర్యవేక్షించారు.

వైఎస్సార్‌బీమా సాయం అందజేత



దాచేపల్లి : మండలంలోని కేసానుపల్లికి చెందిన కంచర్ల అంకమ్మరావు కుటుంబ సభ్యులకు మంగళవారం వైఎస్సార్ బీమా ద్వారా ఆర్థికసాయం అందజేశారు. అనారోగ్యంతో అంకమ్మరావు ఈ నెల 11వతేదీన మృతిచెందాడు. వైఎస్సార్‌బీమాకు అర్హత సాధించడంతో తొలుత రూ.10 వేల నగదును మృతుడి భార్య సత్యవతికి సర్పంచ్ వినుకొండ కోటేశ్వరరావు అందించారు. వైఎస్సార్ బీమా ద్వారా మృతుడి కుటుంబ సభ్యులకు లక్ష సాయం అందుతుందని పంచాయతీ కార్యదర్శి నాగేండ్ల రత్నం చెప్పారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కోట కొండలు, నాయకులు బొల్లా శ్రీనివాసరావు, నెల్లూరి కోటేశ్వరరావు, డిజిటల్ అసిస్టెంట్ షేక్ రసూల్ పాల్గొన్నారు.

విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు నాంది



గిరిజన ఆశ్రమ పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్లను అందజేస్తున్న నేతలు, అధికారులు

పిడుగురాళ్లరూరల్: పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవిరాల కృషి చేస్తున్నారని ఎంపీపీ అల్లు సత్యవతి అన్నారు. మండలంలోని తుమ్మల చెరువు, జానపాడు, కరాలపాడు గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా కానుకను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంతో పోలిస్తే జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యార్థులకు అమ్మ ఒడితోపాటు నాడు, నేడు పథకంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేశారన్నారు. అనంతరం నూతనంగా విచ్చేసి పాఠశాలలకు బదిలీపై వచ్చిన ప్రధానోపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చల్లా పిచ్చిరెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీలు గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, సాతులూరి బాబు, ఉన్నం నరసింహారావు, అల్లు పిచ్చిరెడ్డి, కత్తెరవు రంగారెడ్డి, సొసైటీ అధ్యక్షులు ఉన్నం శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం శ్రీనివాసరావు, కరాలపాడు సర్పంచ్ చల్లా శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దాచేపల్లి : విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాంది పలికారని జెడ్పీటీసీ మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి అన్నారు. మండలంలోని తంగెడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో చదువుకుంటున్న విద్యార్థులు జగనన్న విద్యా కానుక కిట్లను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ..విద్యార్థుల చదువుల కోసం రాష్ట్ర ప్రభుత్వం వేలకోట్లు ఖర్చు చేస్తోందని, విద్యార్థులు ఉన్నతమైన చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు. గత ప్రభుత్వాల్లో విద్యార్థులు బడికి వెళ్లాలంటే పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, యూనిఫారం అందక ఇబ్బందులు పడేవారని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పాఠశాలలు పునఃప్రారంభించిన రోజే జగనన్న విద్యాకానుక విద్యార్థులకు కావాల్సిన అన్నింటిని అందించామని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సర్పంచ్‌లు కొత్తపల్లి కాశయ్య, దైద నాగరాజు, ఎంపీటీసీ పాతుల కమలకుమారి, కో ఆప్షన్ సభ్యుడు షేక్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, నాయకులు బీరవల్లి శౌరైడ్డి, దేవళ్ల వీరాస్వామి, అరికట్ల మల్లారెడ్డి, ఉప్పుతల నరసింహారావు పాల్గొన్నారు.



తంగెడ జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జగనన్న విద్యా కానుక కిట్లు అందజేస్తున్న నేతలు



విద్యా కానుకను అందజేతస్తున్న గ్రామ పెద్దలు,ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు

మాచర్ల రూరల్: విద్యకు పేదరికం అడ్డుకాకూడదని, ప్రతి పేద విద్యార్థి ఉన్నత చదువులు చదువుకోవాలనే లక్ష్యంతో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న విద్యా కానుక పథకం ద్వారా విద్యార్థులకు విద్యా సామగ్రిని అందజేస్తున్నారని జెడ్పీటీసీ మండ్లి పెద మల్లు స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యాకానుకలను అందజేసి మాట్లాడారు. విద్యా వ్యవస్థలోనే సమూల మార్పులు తీసుకొచ్చి పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దటమే కాక, అమ్మఒడి ద్వారా ఒక్కొక్క విద్యార్థికి డిఎస్‌టిడబ్ల్యూఓ ఎల్ వరలక్ష్మి తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

పునీత అంథోనివారిని ఆదర్శంగా తీసుకోవాలి

ఫాదర్ పైఎల్ మర్రెడ్డి



సమష్టి దివ్యపూజాబలిలో పాల్గొన్న భక్తులు

రెంటచింతల: కథోలికులందరు పునీత అంథోనివారి జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని స్థానిక కానుకమాత చర్చి విచారణ గురువులు ఏరువ బాలమర్రెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక అంథోనివారి చర్చి 25వ వార్షికోత్సవం పురస్కరించుకుని ఫాదర్ కొంతం ఎలీషారాజు, ఫాదర్ సురేష్, ఫాదర్ పుష్పరాజు కలిసి ఆయన సమష్టి దివ్యపూజాబలిని సమర్పించి భక్తులను ఉద్దేశించి మాట్లాడారు. పునీత అంథోనివారిని నిండు మనస్సుతో ప్రార్థిస్తే వారికష్టాలు తొలగిపోతాయన్నారు. సమస్తంను త్యజించి లోకరక్షకుడైన ఏసుక్రీస్తు చెప్పిన మార్గంలో జీవించి సువార్తను ప్రకటించి అంథోనివారు పునీతులయ్యారన్నారు. ప్రతి ఒక్కరు అంథోనివారి కరుణపొందేందుకు పరిపూర్ణమైన హృదయంతో ప్రార్థించి శారీరకంగాను, మానసికంగాను స్వస్థత పొందాలన్నారు. అంథోనివారు అనేక అద్భుతాలతో తనను విశ్వశించిన వారికి తన దీవెనలను అందించారన్నారు. చర్చిని రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ప్రత్యేకంగా అలంకరించిన అంథోన్‌వారి స్వరూపంతో భక్తిగీతాలు ఆలపిస్తూ మేళతాలాలతో భారీగా బాణాసంచా కాలుస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగింపును నిర్వహించారు.

దోమల నిర్మూలనతోనే వ్యాధులు దూరం



దోమల నిర్మూలనకు మలాథిన్ మందును పిచికారీ చేయిస్తున్న సిబ్బంది

రెంటచింతల: మన చుట్టూ ఉన్న పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ఆరోగ్య పర్యవేక్షకులు సీహెచ్ అంకమ్మరావు అన్నారు. జిల్లా మలేరియా అధికారి రవి రత్నాకర్ ఆదేశాల మేరకు మంగళవారం దోమల నివారణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రమైన రెంటచింతలలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ బాలబాలికల 5 సంక్షేమ వసతిగృహాల్లో, మిట్టగుడిపాడు గ్రామ సమీపంలోని కస్తూర్బా పాఠశాల వసతి గృహంలో ఆయన మలేరియా సిబ్బందితో దోమలు నిర్మూలనకు మలాథిన్ మందును పిచికారీ చేయించి మాట్లాడారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, చికెన్‌గున్యా తదితర వ్యాధులు దోమల కారణంగా వ్యాపిస్తాయన్నారు. దోమతెరలను వాడే విధానం, భద్రపరుచుకునే విధానాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎస్. మోహన్‌రావు, మలేరియా ఎస్‌యూఓ గౌస్, సంక్షేమ హాస్టల్ వార్డెన్‌లు అరుణ, బేగ్, శారద, గంగాధర్ తదితరులున్నారు.

ఘనంగా పోలేరమ్మ ఆలయ వార్షికోత్సవం



చౌడేశ్వరి అమ్మవారు



పోలేరమ్మ అమ్మవారి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేస్తున్న పిన్నెల్లి వెంకటరామిరెడ్డి

మంచికల్లు(రెంటచింతల): మండలంలోని మంచికల్లు గ్రామంలో గ్రామ దేవతగా పూజలందుకుంటున్న శ్రీ పోలేరమ్మ అమ్మవారి ఆలయ 11వ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ప్రధాన అర్చకులు కారంపూడి వెంకటాచార్యులు ఆధ్వర్యంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఉదయం 5 గం . నుంచి సుప్రభాతం, పంచామృతాభిషేకం, వివిధ రకాల అభిషేకాలు, పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాల వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పిన్నెల్లి వెంకటరామిరెడ్డి పాల్గొని పోలేరమ్మతల్లికి ప్రత్యేక పూజాకార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 12గం.కు వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు పిన్నెల్లి వెంకటరామిరెడ్డి చేతులమీదుగా మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ వేడుకలలో పాల్గొని అమ్మవారికి తమతమ మొక్కులు చెల్లించి ఆమె చల్లని దీవెనలు పొందారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరణాలతో అందంగా అలంకరించారు.

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి అమ్మవారి ఆలయ వార్షికోత్సవం

రెంటచింతల: స్థానిక తహసీల్దార్ కార్యాలయం సమీపంలో వేంచేసిన శ్రీ చౌడేశ్వరి అమ్మవారి ఆలయ 15వ వార్షికోత్సవ వేడుకలను మంగళవారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతి శర్మ నేతృత్వంలో ఉదయం 5గం. నుంచి సుప్రభాత సేవ, వేద పారాయణం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. యాగినిక బ్రహ్మశ్రీ జిగురు శంకరశర్మ, సీహెచ్ సోమేశ్వరశర్మల ఆధ్వర్యంలో శాంతి, రుద్ర, దుర్గా హోమములు జరిపించారు. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు శ్రీ చౌడేశ్వరి అమ్మవారికి బోనాలు సమర్పించారు. అమ్మవారికి సహస్రనామ అర్చనను ఎంతో ఘనంగా నిర్వహించిన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. మధ్యాహ్నం 12గం.ల నుంచి వార్షిక మహోత్సవంలో పాల్గొన్న వేలాదిమంది భక్తులకు మహా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అమ్మవారికి కట్టమూరి వెంకట నాగేశ్వరరావు, కూచిపూడి వెంకటేశ్వర్లు సమర్పించిన పట్టువస్త్రములతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాన్ని రంగు రంగుల విద్యుత్ తోరనాలతో అందంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త శీలం నారాయణ, పెద్దశెట్టి జోకా కొండలు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

మహిళలకు సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలి

మెప్మా ప్రాజెక్టు మిషన్ మేనేజర్ సుబ్బారావు

మాచర్ల: పట్టణంలో ప్రతి వార్డులో ఆర్‌పిలు మహిళలకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి విస్తృతంగా ప్రచారం చేయాలని పురపాలక సంఘ పరిధిలోని డ్వాక్రా సంఘాల మెప్మా ప్రాజెక్టు మిషన్ మేనేజర్ ఎం సుబ్బారావు అన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక మెప్మా ప్రాజెక్టు కార్యాలయంలో జరిగిన అనేక సంక్షేమ పథకాల గురించి ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ ఆసరా, హౌసింగ్, ఋణాలు, డ్వాక్రా మహిళలకు బ్యాంకు లింకేజ్, చేయూత పథకాలను వివరిస్తూ మరింత సంఖ్యలో డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలని ఆయన కోరారు. ఈ విషయంలో మెప్మా రిసోర్సు పర్సన్‌లు నిత్యం ఆయా గ్రూపుల సమావేశాలు నిర్వహించి పొదుపు ఋణాల మంజూరుకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా లావాదేవీలను గ్రూపులు నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అవకతవకలకు అవకాశమివ్వకుండా చూడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో సీఓలు, రాజశేఖర్, అంజలి, ఆయా వార్డుల ఆర్‌పీలు పాల్గొన్నారు.

వైఎస్సార్ యంత్రసేవను సద్వినియోగం చేసుకోవాలి

నరసరావుపేట రూరల్: వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా అందజేసిన యంత్ర పరికరాలను సద్వినియోగం చేసుకునేలా రైతులను చైతన్య పర్చాలని ఏడీఏ పి.మస్తానమ్మ తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లోని అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా రైతులకు ఇచ్చిన పరికరాల వివరాలను యాప్‌లో నమోదుపై గ్రామ వ్యవసాయ సహాయకులకు సబ్ డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటి చేసే దిశగా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు యంత్రపరికరాలను అందజేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయానికి పెద్ద పీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన యంత్రసేవా పథకాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి గ్రామంలో రైతులకు యంత్ర పరికరాలు అందుబాటులో ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వం అందజేసిన యంత్ర పరికరాల వివరాలను గ్రామ వ్యవసాయ సహాయకుల చేత యాప్‌లో నమోదు చేయించారు. అలాగే ఇప్పటివరకు అద్దెకు ఇచ్చిన వస్తువుల వివరాలను నమోదు చేశారు.

షాహీ మసీదు భూములకు కౌలు వేలం

నాదెండ్ల: సాతులూరు 1వ సచివాలయంలో మంగళవారం షాహీ మసీదు భూముల బహిరంగ కౌలు వేలం నిర్వహించారు. కౌలు వేలానికి వక్ఫ్ బోర్డ్ జిల్లా ఇన్‌స్పెక్టర్ షేక్ కరిముల్లా బాషా, తహసీల్దార్ ఏవీ రమణ హాజరయ్యారు. 84 ఎకరాల భూమికి గాను రూ.10 వేలు ధరావత్తు చెల్లించి 10 మంది వేలంలో పాల్గొన్నారు. ఉదయం 11.30 గంటల నుంచి 1.30 గంటల వరకూ వేలం కొనసాగింది. గ్రామానికి చెందిన కోటా ఏలియా ఏడాదికి ఎకరాకు రూ.10,500లు చొప్పున వేలంలో హెచ్చుపాటదారుగా నిలిచాడు. పాట ముగిసే సమయానికి అదే గ్రామానికి చెందిన దావల సోమయ్య రూ.10,600లు అనే లోపే పాట ముగిసిందని అధికారులు పాట నిలిపివేశారు. దీంతో సోమయ్య అధికారులతో వాగ్వాదానికి దిగాడు. దీనిపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందిస్తామని, ఉన్నతాధికారుల నిర్ణయం ప్రకటిస్తామన్నారు.

పథకాల సమాచారం ఉండాలి

బొల్లాపల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఎప్పటికప్పుడు సమాచారం ఉండాలని మండల ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ షేక్‌జిలానీ బాషా అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓపీఆర్ అండ్ ఆర్‌డీ మాట్లాడుతూ లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పూర్తి అవగాహన ఉండే విధంగా సచివాలయాల్లో చర్యలు తీసుకోవాలన్నారు. వైఎస్సార్ బీమా పథకం గురించి చర్చించారు.

నేషనల్ క్రిష్టియన్ బోర్డు సభ్యుల సమావేశం

పిడుగురాళ్ల: పట్టణంలోని జానపాడు రోడ్డులో హాలెలూయా మినిస్ట్రీస్ మందిరం ఆవరణంలో మంగళవారం నేషనల్ క్రిస్టియన్ బోర్డు పల్నాడు జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవుల హక్కుల సాధన కోసం నిర్వహించాల్సిన విధులు, క్రైస్తవ సంఘాల ఐక్యత, అలాగే దేశ సంక్షేమం కోసం, శాంతి భద్రతల కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం జరిగింది. జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జాన్‌మార్క్స్, రాష్ట్ర అధ్యక్షుడు నవీన్‌కుమార్ ఆదేశాల మేరకు నేషనల్ క్రిస్టియన్ బోర్డు ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని అన్ని మండలాల కో ఆర్డినేటర్ల సమావేశం నిర్వహించి క్రైస్తవ హక్కుల కోసం నిర్వహించాల్సిన విధివిధానాలపై చర్చించారు. కార్యక్రమంలో ఎంపీటీ మాచర్ల కో ఆర్డినేటర్ వై. వెంకటేశ్వరరావు, సత్తెనపల్లి కో ఆర్డినేటర్ జి. సుధీర్‌కుమార్‌లు ప్రసంగించారు. సమావేశంలో పిడుగురాళ్ల కో ఆర్డినేటర్ కె. శ్రీనివాసరావు, దానియేలు, కె. జాన్ విక్టర్, పల్నాడు ప్రెసిడెంట్ పి. సుబ్బారావు, జిల్లా సెక్రటరీ స్టీఫెన్ బాబు పాటు పలువురు పాస్టర్లు పాల్గొన్నారు.

గొర్రెల మందపై వీధికుక్కల దాడి

నాదెండ్ల: గొర్రెల మందపై వీధి కుక్కలు దాడి చేసిన ఘటనలో మూడు గొర్రెలు మృతి చెందగా, మరో 14 గొర్రెలు గాయాలపాలైన సంఘటన సోమవారం అర్ధరాత్రి కనపర్రు గ్రామంలోని ఎస్సీ కాలనీలో చోటు చేసుకుంది. జీవాల రైతు పీలా వీరాంజనేయులు తెలిపిన వివరాల మేరకు తనకు 17 జీవాలు ఉన్నాయని, వీటిని షెడ్డులో ఉంచామని, అర్ధరాత్రి సమయంలో వీధి కుక్కల గుంపు షెడ్డులో చొరబడి గొర్రెల మందపై దాడి చేశాయన్నారు. దీంతో మూడు గొర్రెలు మృతి చెందగా, 14 గొర్రెలు గాయాలయయ్యాయని, వీటిని కొన్ని గొర్రెల పరిస్థితి విషమంగా ఉందన్నారు. పశువైద్యాధికారి వద్ద వైద్యం చేయిస్తున్నట్లు తెలిపాడు. సుమారు రూ.1.70 లక్షల వరకూ తనకు నష్టం వాటిల్లిందని వాపో యాడు. గ్రామ పంచాయతీ అధికారులు వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని కోరాడు.

రైతులకు రాయితీపై పచ్చి రొట్ట విత్తనాలు

కావల్యాపురం: ఖరీఫ్ సాగుకు రైతులందరు పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ప్రభుత్వం మంజూరు చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏవో మాట్లాడుతూ మండలంలోని 11 రైతుభరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట సాగు చేయు విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. జీలుగులు 10 కేజీల సంచి రూ. 395లు, జనుము రూ. 420లు పిల్లిపెసర విత్తనాలు 8 కేజీల సంచి రూ.388లు అందజేస్తున్నట్లు చెప్పారు. రైతులందరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు సాగు చేయటం ద్వారా భూమి సారవంతంగా గాను అన్నిపోషకాలు కల్గియుంటాయన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణోత్సవం



నరసరావుపేట ఈస్ట్: కోటప్పకొండరోడ్డు శ్రీనివాసనగర్‌లో వేంచేసియున్న శ్రీగోదా పద్మావతి సమేత శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామివారి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై ఉభయ దేవేరులతో శ్రీవారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి కల్యాణం జరిపారు. వేద పండితులు చిలకపాటి విజయరాఘవాచార్యులు పర్యవేక్షణలో ఋత్విక్కులు సాతులూరి లక్ష్మణస్వామి ఆధ్వర్యంలో అర్చకస్వాములు శ్రీవారి కల్యాణం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు. సాయంత్రం శ్రీగోదా పద్మావతిదేవి సమేతంగా శ్రీవారు తిరువీధి ఉత్సవంలో పాల్గొని భక్తులను అనుగ్రహించారు. కాగా బుధవారం శ్రీసుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి



ఎంపీడీఓ యల్లా మహాలక్ష్మిని సన్మానిస్తున్న జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంబిరెడ్డి నర్సిరెడ్డి

రెంటచింతల: రెంటచింతల నూతన మండల ప్రజా పరిషత్ అధికారి (ఎంపీడీఓ)గా బాధ్యతలు చేపట్టిన యల్లా మహాలక్ష్మిని మంగళవారం జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ శౌంబిరెడ్డి నర్సిరెడ్డి, వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి దుశ్శాలువలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధుల సహకారంతో మండలంలోని వివిధ గ్రామాల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. మండల ప్రజలతోపాటు స్థానిక ప్రజా ప్రతినిధులు సహకరించినప్పుడే సమస్యలను పరిష్కరించడం సాధ్యపడుతుందన్నారు. సన్మానించిన వారిలో పార్టీ నేతలు వడితే బుడ్డసైదా, ఎంపీటీసీ సభ్యుడు కొర్రా సేవా నాయక్ తదితరులున్నారు.

కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని వినతి



కాలనీ వాసులతో మాట్లాడుతున్న మోర్తల ఉమ, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి

రెంటచింతల: స్థానిక రేగులమాన్యం (ఎస్టీ) కాలనీలో పలు నివాసాలకు విద్యుత్ స్తంభాలను ఏర్పాటుచేసేందుకు విద్యుత్ శాఖాధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన కార్యవర్గ సభ్యులు మోర్తల ఉమ, వైస్ ఎంపీపీ ఏరువ శౌరెడ్డి కోరారు. మంగళవారం ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు కాలనీలలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వారు తెలుసుకున్నారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయకపోవడంతో కర్రల సహాయంతో విద్యుత్ సౌకర్యం పొందుతున్నట్లు ఇది ఎంతో ప్రమాదకరమైనా.. ఎవరూ పట్టించుకోవడంలేదని కాలనీవాసులు వాపోయారు. వెంటనే మోర్తల ఉమ, ఏరువ శౌరెడ్డిలు విద్యుత్‌శాఖాధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరారు. కాలనీలోని అంతర్గత రహదారుల అభివృద్ధి పనులు త్వరలోనే చేపట్టనున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్క కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడానికి అధికారుల దృష్టికి తీసుకువెళ్తానన్నారు.

నేడు రక్తదాన శిబిరం ఏర్పాటు

గురజాల : స్థానిక ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ రక్త దాన దినోత్సవాన్ని పురస్కరించుకుని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం జరుగుతుందని జోనల్ సూపర్‌వైజర్ విశ్వేశ్వరరావు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రక్త దాన శిబిరం అందుబాటులో వుంటుందని ఎవరైనా రక్తదానం చేయుటకు ఆసక్తి కలిగిన వారు వచ్చి రక్తదానం చేయాలన్నారు. వలంటీర్, గృహసారథులు, సచివాలయ సిబ్బంది, కుల సంఘాలు, ఫ్యాన్స్ అసోసియేషన్‌లు రక్తదానం చేయుటకు ముందుకురావాలన్నారు.

మృతురాలి నేత్రాలు దానం చేసిన బంధువులు

కావల్యాపురం:మండలంలోని వేల్పూరు గ్రామంలోని బీసీ కాలనీ వాసీ తలియాకుల శశికళ (50) అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. అమ్మ నేత్ర శరీర అవయవ దాన ప్రోత్సాహక సంఘం పల్నాడు జిల్లా కోఆర్డినేటరు చంద్రపాటి చలపతిరావుకు కుటుంబ సభ్యులు సమాచారం అందించారు. గుంటూరు పెదకాకాని శంకర కంటి వైద్యశాల ఐ బ్యాంకు సిబ్బంది డాక్టరు మయూరి తన సిబ్బంది ప్రత్యేక వాహనంతో వేల్పూరు గ్రామం సందర్శించి మృతురాలు శశికళ కంటిలోని కార్నియా పొరలను తీసుకున్నారు. తలియాకుల రాఘవేంద్రరావు, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, రవికుమార్, శ్రీకాంత్, ఎస్.పరమేశ్వరరావులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

వినుకొండ (నూజెండ్ల): నూజెండ్ల మండలం తిమ్మాపురం గ్రామ పంచాయతీలో గల గాంధీనగర్‌లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీపీ మేడం జయ రామిరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఉపాధి కూలీలతో కనీసం 3 గంటలు పని చేయించాలని, గ్రామంలో కాలువలు శుభ్రంగా చేసుకోవాలని సూచించారు. ఏపీవో నాగేశ్వరరావు, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.